సాక్షి
జగిత్యాల
గురువారం । 30 । మే । 2024


కొండగట్టులో ప్రారంభమైన అంకురార్పణ


విద్యుత్‌కాంతుల మధ్య ఆలయం

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న శ్యాంప్రసాద్

బుగ్గారం: మండలంలోని శెకల్లలో ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రౌతు రాజేశ్, ఉపాధ్యక్షులు రామడుగు రాజేశ్, జాయింట్ సెక్రెటరీ మామిడాల శ్రీకాంత్‌కుమార్, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

మోదీ పథకాలే గెలిపిస్తాయి


ఎంపీ అర్వింద్‌తో నాయకులు

రాయికల్: కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తుందని, ప్రధానిగా మోదీ ప్రజలకు అందించిన పథకాలే గెలిపిస్తాయని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బుధవారం నిర్వహించిన రాయికల్ మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మండలంలో నమోదైన పోలింగ్ శాతంపై ఆరా తీశారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు సురతానిభాగ్యలక్ష్మి, మండల నాయకులు దొంగ లింగారెడ్డి, సద్ది మహిపాల్‌రెడ్డి, కొల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


కూలీల మస్టర్ పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీనివాస్

మల్యాల: మండలంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవో శ్రీనివాస్ పరిశీలించారు. మండలవ్యాప్తంగా బుధవారం 3,701 మంది కూలీలు హాజరై జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. టీఏ లావణ్యతో కలిసి మస్టర్‌లో నమోదైన కూలీల వివరాలను పరిశీలించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నామని వివరించారు.

పట్టు పురుగుల పెంపకంపై శిక్షణ


శిక్షణకు హాజరైన రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాలలో పట్టు పురుగుల పెంపకంపై బుధవారం యువ రైతులకు శిక్షణ ఇచ్చారు. కళాశాల అసోసియేట్ డీన్ భారతి నారాయణ్ భట్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల రైతులకు ఆదాయం పెంచేందుకు వ్యవసాయ కళాశాల ద్వారా పట్టు పురుగుల పెంపకంపై శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు ముందుకొస్తే బృందాలవారీగా శిక్షణ ఇస్తామని వివరించారు. కార్యక్రమం కో–ఆర్డినేటర్ రత్నాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు జి.వేణుగోపాల్, శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


హెల్త్ క్యాంపు ప్రారంభిస్తున్న డీఎం సునీత

జగిత్యాలటౌన్: విధి నిర్వహణతోపాటు తమ ఆరోగ్య పరిరక్షణపైనా శ్రద్ధ వహించాలని ఆర్టీసీ జగిత్యాల డిపో మేనేజర్ సునీత సిబ్బందికి సూచించారు. గ్రాండ్‌హెల్త్ చాలెంజ్ 2.0 పేరుతో బుధవారం జగిత్యాల డిపోలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆర్టీసీ కార్మికులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్మికులు, సిబ్బంది క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడాలన్నారు. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే ఆర్టీసీ మనుగడ సాధ్యమని తెలిపారు. మెకానికల్ ఇంజినీర్ కవిత, సెక్యూరిటీ గార్డ్ శేఖర్, బీఆర్.రావు కార్మికులు పాల్గొన్నారు.

అవినీతి పుట్ట.. ఆగేది ఎట్టా..

- వెలుగుచూస్తున్న సిబ్బంది అవినీతి
- ఆరోపణలు వచ్చినా పట్టని అధికారులు
- కళ్లముందు అక్రమాలు కనిపిస్తున్నా చర్యలు శూన్యం



జగిత్యాల మున్సిపాలిటీ కార్యాలయం

జగిత్యాల: మున్సిపాలిటీల ద్వారా ప్రజలకు ప్రధానంగా అందాల్సిన సేవలు మ్యూటేషన్లు, అసెస్మెంట్లు, వీఎల్టీ, ఇంటి అనుమతులు. అయితే ఈ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు అందులోని లొసుగులు తెలుసుకుని అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాక్షాత్తు జిల్లాకేంద్రమైన జగిత్యాల బల్దియాలోనే ఇంత తతంగం జరుగుతున్నా ఉన్నతాధికారులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. ఇటీవల టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ విభాగాల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నారు. తాజాగా తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలతో బల్దియాకు సంబంధం లేకున్నా హస్నాబాద్ పరిధిలో అత్యధిక విలువ గల స్థలానికి వీఎల్టీ ఇవ్వడం చర్చకు దారితీస్తోంది. ఇందులో పెద్దమొత్తంలో చేతులు మారినట్లు సమాచారం. ఇవి బయటకు పొక్కడంతో కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే దీనిపై జవాబు ఇవ్వాలంటూ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

ఆరోపణలు వచ్చినా..

రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారి మ్యూటేషన్లు, అసెస్మెంట్లు, వీఎల్టీలలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు స్వయంగా కౌన్సిలర్లే ఆరోపించారు. అతడిని సరెండర్ చేయాలని అందరూ కలిసి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. దీంతో సదరు అధికారి ఆడిందే ఆటగా మారింది. శానిటేషన్ విభాగంలోనూ బీరువాలకు సంబంధించిన బిల్లులు, డీజిల్ బిల్లుల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని బహిరంగంగా తెలుస్తున్నా చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ పారిశుధ్య వాహనాల్లో వారానికొకసారి డీజిల్ పోసేందుకు కమిషనర్ కూపన్ రాసిచ్చేవారు. ఇప్పుడు ఆ వ్యవస్థ ఎత్తివేయడం అనుమానాలకు తెరలేస్తోంది. పారిశుధ్య కార్మికుల నియామకాలు ఇష్టానుసారంగా చేపడుతున్నట్లు ఆరోపణలున్నాయి. అలాగే వాహనాల మరమ్మతు పేరిట దోపిడీ చేస్తున్నారని, మరమ్మతు పేరిట షెడ్డుకు వెళ్లిన వాహనాలు మాయం అవుతున్నాయని కౌన్సిలర్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం పనిచేయకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారుల మధ్య పొసగకపోవడంతో ఇటీవలే టీపీవోగా పనిచేస్తున్న శ్రీనివాస్ సెలవులో వెళ్లిపోయారు. సదరు అధికారికి తెలియకుండానే నేరుగా కమిషనర్ ద్వారానే ఎగ్జిబిషన్, ఓ మేళా ఏర్పాటు చేయగా.. నేరుగా అమ్యామ్యాలు పుచ్చుకుని ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇలా ప్రతి ఒక్క శాఖలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నా సదరు అధికారులపై చర్యలు తీసుకోకపోవడం.. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో అనుమానాలకు దారితీస్తోంది.

విజిలెన్స్ విచారణ

జగిత్యాల మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ విభాగాల్లో అవినీతి ఆరోపణలు రావడంతో విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నారు. వారు రికార్డులు కోసం మూడుసార్లు లేఖలు పంపించారు. దీంతో సిబ్బంది ఆఫీసులో కూర్చుని రికార్డులు తయారుచేసి పంపించారు. అందులోనూ తప్పులున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు సక్రమంగా లేకపోవడంతో సెట్‌బ్యాక్ లేకుండానే అనేక నిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయి.

విచారణ చేపడుతున్నాం



తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలతో వీఎల్టీ ఇచ్చినట్లు దృష్టికి వచ్చింది. దానిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నాం. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వీఎల్టీ రద్దు చేస్తాం.

– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్

గాడినపడని పాలన

బోగ శ్రావణి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా రాజీనామా చేయడంతో ఏడాదిపాటు వైస్ చైర్మన్ శ్రీనివాస్ ఇన్‌చార్జిగా కొనసాగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. బీఆర్‌ఎస్ రెబల్ అభ్యర్థి అడువాల జ్యోతి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. కొత్త పాలకవర్గం ఏర్పడటంతో పాలన గాడిలో పడుతుందని అనుకున్నా.. ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు కనిపించడం లేదు. ఎన్నిసార్లు అవినీతి ఆరోపణలు వచ్చినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. పాలకవర్గం స్పందించి టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగాల్లో ఏం జరుగుతుందో పరిష్కరించాల్సిన బాధ్యత వారిపై ఉంది. ఇంత తతంగం జరుగుతున్నా.. లోకల్‌బాడీ అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు స్పందించకపోవడం విశేషం.

అబద్ధాలతోనే కాంగ్రెస్ అధికారంలోకి..

- కరెంటు కోతలు, రైతుల ఇబ్బంది పట్టదు
- కనీసం పచ్చిరొట్ట విత్తనాలు అందించడం లేదు
- విప్ లక్ష్మణ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమాధానం చెప్పాలి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్


మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్, చిత్రంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: పచ్చి అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో కరెంటు కోతలు లేవని, ఏ రోజు కూడా పంటలు ఎండిపోలేదని, ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాయని పేర్కొన్నారు. ఇప్పుడు రైతులు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారని, బస్తాకు రెండుమూడు కిలోల తరుగు తీస్తున్నారని తెలిపారు. తరుగుపై బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్ లక్ష్మణ్‌కుమార్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కనీసం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందించలేకపోతున్నారని తెలిపారు. రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, అందుకే ఆదిలాబాద్ జిల్లాలో రైతులపై లాఠీచార్జి చేయిందని పేర్కొన్నారు. రాష్ట్రం రాకముందు పాలన ఎలా ఉండేదో.. ఇప్పుడూ అలాగే మారిందని ఎద్దేవా చేశారు. జిల్లాలో ఆరు లక్షల టన్నుల ధాన్యం పండితే నాలుగు లక్షల టన్నులు మాత్రమే కొన్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు అభివృద్ధి నిధులు మంజూరు చేస్తే వాటిని ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. ఆర్నెల్లు నిండకుండానే ప్రభుత్వం అవినీతిమయంగా మారిందన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ఇప్పుడు మాత్రం రైతుబంధు కూడా ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. రాహుల్‌గాంధీ వడ్లు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని జగిత్యాలలో హామీ ఇచ్చారని, ఇప్పుడు ఏమైందని ప్రశ్నించారు. సమావేశంలో బల్దియా వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన పడొద్దు


మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: విత్తనాల విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని, ఖాళీ ప్యాకెట్లను పంట పూర్తయ్యే వరకూ భద్రపరచుకోవాలని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో 52 బృందాలను ఏర్పాటు చేశామని, సమాచారం ఉంటే అందించాలని సూచించారు. వరి, మొక్కజొన్న, పత్తి, కందులు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల నిల్వలు అవసరమైన మేర ఉంచినట్లు తెలిపారు. సమావేశంలో డీఏవో వాణి, అడిషనల్ కలెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో విద్యార్థి డిబార్

జగిత్యాల: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా కోరుట్ల పరీక్షా కేంద్రంలో ఓ విద్యార్థి మాల్‌ప్రాక్టీస్ చేస్తుండగా డిబార్ చేసినట్లు ఇంటర్‌మీడియట్ నోడల్ అధికారి బి.నారాయణ తెలిపారు. మొత్తం 2,450 విద్యార్థులకు 2,367 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

నృసింహాలయంలో భక్తుల రద్దీ

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



ఆలయ భూములకు రక్షణ

- పట్టాల జారీకి ప్రభుత్వం నిర్ణయం
- జిల్లాలో 93 దేవాలయాలు
- వీటి పరిధిలో సుమారు 617 ఎకరాలు


దుంపేటలో శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయం

కథలాపూర్: ఆలయాల భూములకు రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆలయాల పేరిట ఉన్న భూములు చాలాచోట్ల ఆక్రమణకు గురయ్యాయి. అలాంటి వాటిని గుర్తించి భూములను స్వాధీనం చేసుకుని, వివాదాలు పరిష్కరించి పట్టాపాస్‌బుక్కులు జారీ చేయనుంది. ఇది త్వరగా పూర్తయితే ఆక్రమణకు గురైన భూములు ఆయా దేవాలయాల పరిధిలోకి రానున్నాయి. వాటిద్వారా వచ్చే ఆదాయంతో ఆలయాలు అభివృద్ధి చెందనున్నాయని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

270 ఆలయాల్లో ధూపదీప నైవేద్యం

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలు ఉన్నాయి. 380 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామాలు, పట్టణాల్లో ఆదాయం వస్తున్న ఆలయాలు మాత్రమే దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్నాయి. ఇక ఆదాయం రాని సుమారు 270 ఆలయాలకు ధూపదీప నైవేద్యం కింద నెలకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. ఆ డబ్బులతో ఆలయాల్లో నిత్యపూజలు నిర్వహిస్తున్నారు.

93 ఆలయాల పరిధిలో 617 ఎకరాల భూమి

జిల్లాలోని అన్ని గ్రామాల్లో వివిధ ఆలయాలు ఉన్నా.. 93 ఆలయాలకు మాత్రమే భూమి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటి పరిధిలో 617 ఎకరాలు ఉన్నట్లు తెలుస్తోంది. ధరణి పోర్టల్ రాకముందు ఆలయ భూములన్నీ మిగులు భూములుగా రికార్డుల్లో నమోదు చేశారు. దీంతో కొన్ని ఆలయాల భూములు ఆక్రమణకు గురయ్యాయని భక్తులు అంటున్నారు. అప్పట్లో కొన్ని ఆలయాల భూములు అర్చకుల పేరు మీద ఉండేవి. ధరణి పోర్టల్ వచ్చాక అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆలయ భూముల వద్ద బోర్డులు ఏర్పాటు చేయించింది. సమస్య ఉన్న భూములు మాత్రం అలాగే ఉండిపోయినట్లు సమాచారం. విలువైన భూములు ఆక్రమణకు గురైనా చర్యలు తీసుకోవడంలో ఏళ్ల తరబడి జాప్యం జరగడంతో వాటి గురించి తెలిసిన భక్తులు ఆవేదనకు గురయ్యారు. ప్రస్తుతం ఆలయాల భూములకు రక్షణ కల్పించాలని, వాటికి పట్టాపాసుబుక్కులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో భక్తుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ పరిశీలనలో ఉంది

ఆలయాల భూములకు పట్టా జారీ చేయాలనే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఆలయాల భూముల విషయంలో ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నాం. ఆలయాల భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తాం.

– చంద్రశేఖర్, అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయ శాఖ

అర్చకుల పేర్లు చేర్చాలి



ఆలయాల భూములకు పట్టాబుక్కులు ఇస్తామని ప్రభుత్వం నిర్ణయించడం మంచిదే. ధరణి పోర్టల్‌లో అనుభవదారుకాలం చేర్చి అర్చకుల పేరు నమోదు చేయాలి. కౌలుదారుల మాదిరిగానే అర్చకులకూ రైతుభరోసా చెల్లించాలి.

– ఓరుగంటి మాధవాచార్యులు, అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



దేవుడి భూములను కబ్జా చేయడం దారుణం. దేవాదాయశాఖ రికార్డుల ప్రకారం భూముల వివరాలు సేకరించాలి. ఆక్రమణకు గురైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి దేవాలయాల భూములను రక్షించాలి.

– బద్రి సత్యం, సిరికొండ, కథలాపూర్ మండలం

ముస్తాబైన కొండగట్టు

- నేటి నుంచి హనుమాన్ పెద్ద జయంతి
- అంకురార్పణతో ప్రారంభమైన ఉత్సవాలు
- తరలిరానున్న లక్షలాది మంది స్వాములు
- భక్తులకు సరిపడా ఏర్పాట్లు చేశామన్న ఈవో


స్వాగత ద్వారం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారి పెద్ద జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 30 నుంచి జూన్ ఒకటి వరకు వేడుక జరగనుంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ చేసిన రుత్విక్కులు అఖండ దీపస్థాపన గావించారు. జయంతికి సుమారు మూడు లక్షల మంది మాలధారులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి..

స్వామివారి చెంతకు వచ్చే భక్తులకు తాగునీటి ఇక్కట్లు లేకుండా 28 చలివేంద్రాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, మూడుచోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గుట్ట కింద నుంచి నాలుగు ఉచిత బస్సులు, మాల విరమణకు దీక్ష మండపం, కేశ ఖండనానికి కోనేరు పక్కన స్థలాన్ని ఏర్పాటు చేశారు. ప్రసాదం కౌంటర్లు, దర్శనానికి అదనపు క్యూలైన్లు, అగ్ని ప్రమాదాలు నివారణకు ఫైరింజన్‌ను అందుబాటులో ఉంచారు. 650 మంది పోలీసుల బందోబస్తు నిర్వహించనున్నారు. కోనేటిని ప్రతిరోజూ నింపనున్నారు. బొజ్జ పోతన్న ఆలయ సమీపంలో పార్కింగ్‌కు స్థలం సిద్ధం చేశారు. ఏర్పాట్లను జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ప్రతిరోజూ సమీక్షిస్తున్నారని, ఏమైనా సమస్యలుంటే 94910 00653కు సమాచారం అందించాలని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు.

ఎరువులు, విత్తనాలు సిద్ధం


ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న వాణి

సారంగాపూర్: వానాకాలం పంటలకు సరిపడా ఎరువులు, విత్తనాలను సిద్ధంగా ఉంచినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వాణి అన్నారు. బుధవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. సారంగాపూర్ సింగిల్‌విండో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు 14,300 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు కేటాయించారని, ఇప్పటివరకు 7,805 క్వింటాళ్లు జిల్లాకు చేరాయని తెలిపారు. జనుము 2,560 క్వింటాళ్లకు 1,150 క్వింటాళ్లు వచ్చినట్లు పేర్కొన్నారు. 40వేల పత్తి ప్యాకెట్లకు 12వేల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. యూరియా 17,252 టన్నులు, డీఏపీ 1,438 టన్నులు, కాంప్లెక్స్ 7,178 టన్నులు, పొటాష్ 2,242 టన్నులు సిద్ధంగా ఉంచామన్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు రశీదు తప్పకుండా అందించాలని సూచించారు. ఆమె వెంట విండో సీఈవో ఎండీ.ఇస్మాయిల్, వ్యవసాయ అధికారులు తిరుపతినాయక్, అనూష, ఏఈవో వెంకటేశ్, ఆంజనేయులు, సందీప్, శిరీష తదితరులు ఉన్నారు.

చెన్నకేశవస్వామి ఆభరణాలకు భద్రత కరువు

- స్వామివారికి రూ.12 లక్షల విలువైన వెండి ఆభరణాలు
- భద్రత లేకపోవడంపై ఆలయ కమిటీలో ఆందోళన


రాయికల్‌లోని చెన్నకేశవనాథ ఆలయం

రాయికల్: పట్టణంలో అతిపురాతన ఆలయమైన చెన్నకేశవనాథ స్వామివారి ఆభరణాలకు భద్రత లేకుండాపోతోంది. ఆలయాన్ని ఎప్పుడో నిర్మించింది కావడం.. ఆలయ తలుపులు కొంచెం పాతబడడం.. పైగా ఇటీవల ఆలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టడం.. కొద్దిరోజులుగా వరుస దొంగతనాలు జరగడం వంటి సంఘటనలు భక్తులను కలవరపెడుతున్నాయి. ఆభరణాలను ఎక్కడ భద్రపర్చాలో తెలియక ఆలయ కమిటీ నిర్వాహకులూ తలలు పట్టుకుంటున్నారు. ఆలయంలోని ఉత్సవమూర్తులకు ఉన్న తొడుగు, నాగపడిగె, దారపాత్ర, తీర్థం గిన్నె, కిరీటాలు, వెండి శఠగోపం వంటివి సుమారు 14 కిలోల వెండి ఆభరణాలున్నాయి. వీటివిలువ సుమారు రూ.12 లక్షల వరకు ఉంటుంది. వాటిని ప్రస్తుతం ఆలయంలోనే భద్రపరుస్తున్నారు. ఆలయంలోని సీసీ కెమెరాలు కూడా పనిచేయడం లేదు. కనీసం ఏదైనా బ్యాంకులో లాకర్ సౌకర్యం ఉన్నా అక్కడ ఆభరణాలు భద్రపరిచే అవకాశం ఉండేది. కానీ లాకర్ సౌకర్యం కూడా లేకపోవడంపై భక్తులు పెదవి విరుస్తున్నారు. ఆలయ కమిటీ స్పందించి యుద్ధప్రతిపాదికన ఆలయంలో ఉన్న ఆభరణాల భద్రతకు చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాలను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. దీనిపై ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మల సదాశివరెడ్డి మాట్లాడుతూ.. ఆభరణాల భద్రతకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌కు ప్రధాన బాధ్యుడు కేసీఆర్

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ఫోన్ ట్యాపింగ్‌కు మాజీ సీఎం కేసీఆర్ ప్రధాన బాధ్యుడు అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఈ వ్యవహారంలో కేంద్రప్రభుత్వం సీబీఐతో విచారణ చేయించి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చడమే కేసీఆర్ పాలిట శనిలా మారిందన్నారు. హిందు సమాజం మెప్పు పొందేందుకు ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటున్న ప్రధాని మోదీ.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ముసుగులో ముస్లింలకు లబ్ధి చేకూరుస్తున్నారని విమర్శించారు. ఆర్థిక వెనుకబాటు ప్రాతిపదికగా తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో బడుగు, బలహీన వర్గాలకు అవకాశం కల్పించకపోవడం వారిని మోసగించడమేనన్నారు. ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి రాగానే రిజర్వేషన్లలో సమూల మార్పులు తెస్తామన్నారు. ప్రధాని హోదాలో ప్రజలను తప్పుదోవ పట్టించడం తప్ప మోదీ పదేళ్లలో హిందువులకు ప్రత్యేకంగా చేసిందేమీలేదన్నారు. జగిత్యాల బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజంగి నందయ్య, పుప్పాల అశోక్, ముస్కు ఎల్లారెడ్డి, చంద రాధాకిషన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

కరీంనగర్‌క్రైం: కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరు చికిత్స పొందుతూ చనిపోయారు. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వంతడ్పుల గ్రామానికి చెందిన భానుప్రకాశ్‌రెడ్డి(21) కుటుంబం ప్రస్తుతం కొత్తపల్లి మండలం చింతకుంటలో నివాసం ఉంటున్నారు. భానుప్రకాశ్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. మంగళవారం స్నేహితులను కలిసేందుకు కరీంనగర్ వచ్చాడు. నగరంలోని హనుమాన్‌నగర్‌లో నివసించే చొప్పరి రిత్విక్, మరో ఇద్దరు స్నేహితులను కలిశాడు. రాత్రి ఒంటిగంట సమయంలో రిత్విక్, భానుప్రకాశ్‌రెడ్డి బైక్‌పై మంకమ్మతోట ప్రధాన రోడ్డు వైపు వెళ్తుండగా.. కొత్త లేబర్ అడ్డా సమీపంలో కుక్క అడ్డువచ్చింది. బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్‌స్తంభానికి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో భానుప్రకాశ్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడ్డ రిత్విక్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి మృతదేహం లభ్యం


అభిషేక్ మృతదేహం

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం చెరువులో గల్లంతయిన అభిషేక్ మృతదేహాన్ని వెలికితీశారు. జిల్లా కేంద్రంలోని వాణినగర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్, లావణ్య కుమారుడు అభిషేక్ తమ బంధువులతో కలిసి అంతర్గాం చెరువుకు ఈతకు వెళ్లారు. ఈత రాకపోవడంతో అభిషేక్ మృతి చెందాడు. అప్పటికే రాత్రి కావడంతో అభిషేక్ మృతదేహం లభ్యం కాలేదు. బుధవారం కూడా గాలింపు చర్యలు చేపట్టగా శవం కనిపించింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


కనకవ్వ(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన కుతాడి కనకవ్వ(40) ఈనెల 20న తన కుమారుడు పర్శరాములుతో కలిసి ముస్తాబాద్‌కు బైక్‌పై వెళ్లింది. నామాపూర్ క్రాసింగ్ వద్దకు రాగానే బైక్ వెనుక టైరులో కనకవ్వ చీర చిక్కుకుని కింద పడిపోయింది. ఈ సంఘటనలో కనకవ్వకు తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కనకవ్వ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. కనకవ్వకు భర్త చంద్రం, కుమారుడు పర్శరాములు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవంపల్లికి చెందిన యువకుడు..

మానకొండూర్: మండలంలోని దేవంపల్లికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. చీకట్ల వెంకటేశం(29) కరీంనగర్ వీడియో మిక్సింగ్ షాపులో పనిచేస్తూ జీవనం గడిపేవాడు. వ్యాపారంలో నష్టం రావడంతో మానసికంగా బాధపడుతూ కొద్ది నెలలుగా ఇంటివద్దే ఉంటున్నాడు. ఈ నెల 16న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని, మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజుకుమార్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9253560455. [T-1262254]

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K Ph: 9640258899/ 9640468899 [H-799885]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

ఆన్‌లైన్ ఆటలు.. ఆర్థికంగా కుదేలు

- అప్పులపాలు.. ఆత్మహత్యలు
- చితికిపోతున్న యువత
- ఆందోళనలో తల్లిదండ్రులు
- పరువుపోతుందని కేసులు పెట్టని వైనం



వేములవాడ: అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను కొందరు మంచికి వినియోగించుకుంటే.. మరికొందరు ఆన్‌లైన్‌గేమ్స్ ఆడుతూ అధఃపాతాళానికి పోతున్నారు. క్రమంగా ఆన్‌లైన్ ఆటలకు అలవాటు పడిన యువత ఎవరిమాట వినకుండా తయారవుతున్నారు. లక్షల రూపాయలు నష్టపోయి పెద్దలకు చెప్పుకోలేక కొందరు ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. మరికొందరు తల్లిదండ్రుల ఖాతాల్లో నుంచి దొంగతనాన తీసుకొని అప్పులు చెల్లిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో ఇటీవల పెరిగిపోయాయి.

నిత్యం ఆన్‌లైన్‌లో..

ఆండ్రాయిడ్ ఫోన్లు, అన్‌లిమిటెడ్ డాటా ఉండడంతో ఎవరిని చూసిన నిత్యం ఆన్‌లైన్‌లోనే ఉంటున్నారు. రమ్మి, క్యాసినో.. తదితర కొత్తకొత్త పేర్లతో అట్రాక్ట్ చేస్తున్న ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ లక్షల్లో నష్టపోతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా చేతిలో ఫోన్‌తోనే గడుపుతున్నారు. ఇలా అలవాటుపడ్డ వాళ్లలో కొందరి మానసిక స్థితి సరిగ్గా లేకుండా పోయింది. మరికొందరైతే పెద్దల మాటలకు ఎదురుచెప్పడం, కుటుంబ సభ్యులపై దాడి చేయడం వంటి స్థితికి చేరుకుంటున్నారు.

లాభాలు వస్తున్నాయనే ఆశతో..

అప్పుడప్పుడే ఆన్‌లైన్ గేమ్స్ మొదలుపెట్టిన వారికి మొదటల్లో చిన్నపాటి లాభాలు ఆశచూపుతారు. ఇలా ఆ గేమ్స్‌కు ఆకర్షితులను చేసి క్రమంగా డబ్బులు గుంజుతుంటారు. జిల్లాలో ఇలా ఆన్‌లైన్ గేమ్స్ ఆడి కుదేలైన కుటుంబాలు అనేకం ఉన్నాయి. అయితే ఇలా నష్టపోయిన కుటుంబాలకు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనకాడుతున్నాయి. తమ కుటుంబం పరువు పోతుందనే భయంతో ఫిర్యాదు చేయడం లేదు.

ఆన్‌లైన్ గేమ్స్ ఆడి నష్టపోయిన వారు ఇలా..

- వేములవాడకు చెందిన ఓ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి రైల్వేశాఖలో విధులు నిర్వర్తించేవాడు. సహచరులతో ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి ఉన్న ఆస్తిని పోగొట్టుకున్నాడు. అప్పుల పాలు కావడంతో మానసికంగా కుంగిపోయి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు రోడ్డున పడ్డారు.
- ఇటీవల వేములవాడలో రూ.2కోట్లతో ఉడాయించిన పూజారి మహేశ్ కూడా ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడ్డట్లు సన్నిహితుల ద్వారా తెలిసింది. ఆన్‌లైన్ గేమ్స్ ఆడి లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నాడని స్నేహితులు తెలిపారు.
- వేములవాడకు చెందిన యువకులు రాజు, వెంకటేశ్, రమణ, శ్రీనివాస్.. ఆన్‌లైన్ గేమ్ పేరుతో క్యాసినో తదితర ఆటలవైపు మొగ్గుచూపారు. దాదాపు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు నష్టపోయారు.

అవగాహన కల్పిస్తున్నాం

ఆన్‌లైన్ గేమ్స్, సైబర్‌క్రైమ్‌లపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం. కళాబృందాల ద్వారా గ్రామీణులను చైతన్యం చేస్తున్నాం యువత ఆన్‌లైన్ గేమ్‌లకు బానిస కావడం సమాజానికి మంచిది కాదు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. స్కిల్ గేమ్స్ మాత్రమే ఆడాలి. అధిక డబ్బులు వస్తాయని ఆశ చూపే ఏ గేమ్ కూడా వాడొద్దు. అలాంటి గేమ్స్ వాడితే ఆర్థికంగా నష్టపోతారు. ఇలా ంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలి.

– నాగేంద్రచారి, వేములవాడ డీఎస్పీ

ఒలింపిక్ సంఘం ఎన్నికల బరిలో జనార్దన్‌రెడ్డి

- సంయుక్త కార్యదర్శి పదవికి నామినేషన్


నామినేషన్ పత్రాలు అందిస్తున్న జనార్దన్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: తెలంగాణ ఒలింపిక్ సంఘం నూతన కార్యవర్గానికి ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 25న విడుదలైంది. నామినేషన్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి పదవికి నామినేషన్ దాఖలు చేశారు. హైదరాబాద్‌లోని ఒలింపిక్ భవన్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మాజీ జడ్జి సి.ప్రవీణ్ కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందించారు. జూన్ 9న జరగనున్న తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శిగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట పెద్దపెల్లి జిల్లా జూడో సంఘం ప్రధాన కార్యదర్శి సిలివేరి మహేందర్ తదితరులు ఉన్నారు.

మరిమడ్లలో దొంగతనం

కోనరావుపేట(వేములవాడ): రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్లలో బుధవారం తెల్లవారుజామున దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన చింతలపల్లి సుమన్ రాత్రి వేళ కుటుంబసభ్యులతో కలిసి మేడపైన పడుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 3 జతల కమ్మలు, ఒక జత మాటీలు, 12 తులాల వెండి గొలుసులు, తులంన్నర బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గట్టెపల్లిలో ట్రాక్టర్ చోరీ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గట్టెపల్లి గ్రామంలోని గోస్కుల ఓదెలకు చెందిన ట్రాక్టర్ మంగళవారం రాత్రి చోరీకి గురైయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తన ఇంటి ముందు ట్రాక్టర్ పార్కింగ్ చేశాడు. ఆ తర్వాత కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన బంధువును చూసేందుకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి వచ్చాడు. ట్రాక్టర్ కనబడకపోవడంతో బుధవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

యువకుడి అదృశ్యం


అబ్దుల్‌రవూఫ్

గోదావరిఖని: స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన అబ్దుల్ రవూఫ్(30) మంగళవా రం ఇంట్లో నుంచి వెళ్లి తిరి గి రాలేదని వన్‌టౌన్ పోలీ సులు తెలిపారు. రాత్రి రెండు గంటల సమయంలో కుటుంబ సభ్యులతో గొడవ పడి మోటార్ సైకిల్‌పై బయటకు వెళ్లాడని పేర్కొన్నారు. తండ్రి మొహినుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. యువ కుని ఆచూకీ తెలిస్తే వన్‌టౌన్ సీఐ 87126 56516, ఎస్సై శ్రీనివాస్ 90100 72555 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

మార్కులు తక్కువ వచ్చాయని..


మానస(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): నాయకంపల్లి తండాకు చెందిన మైనేని మానస(15) పదో తరగతిలో మార్కులు తక్కువగా వచ్చా యని మనస్తాపం చెంది బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో 6.3 జీపీఏ వచ్చిందని కొద్దిరోజులుగా మనస్తాపంతో ఉంటోంది. జీవితంపై విరక్తితో బుధవారం ఇంట్లో లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రైవేట్ స్కూళ్ల దందాపై ఉద్యమించండి


మాట్లాడుతున్న రాజు నాయక్

కరీంనగర్: ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై ఉద్యమించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజు నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మా ట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా, ఫైర్ సేఫ్టీ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అనుమతి లేకుండా ప్రైవేట్ విద్యాసంస్థలు వెలుస్తున్నాయన్నారు. వి ద్యార్థులకు సరైన క్రీడా మైదానం, అపార్ట్‌మెంట్ లాంటి భవనాల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారన్నారు. విచ్చలవిడిగా టెక్నో, కాన్సెప్ట్, ఎక్స్‌ప్లోరికా, వరల్డ్, ఐఐటీ, జేఈఈ, సీబీఎస్ఈ వంటి రకరకాల తోక పేర్లను పెట్టి ఆకర్షించేలా ప్రచారాలు చేస్తూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్‌స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని వారిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల హాస్టళ్ల ఆగడాలపై ఫుడ్‌ఇన్స్‌పెక్టర్ అధికారులు, విజిలెన్స్ అధికారులు ఎంక్వైరీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు సత్యంనాయక్, జిల్లా కార్యదర్శి మోతిలాల్, తిరుపతి నాయక్, కృష్ణ నాయక్, సక్రు నాయక్, వీరన్న నాయక్, శ్రీను నాయక్, జోహార్ లాల్‌నాయక్, భీమానాయక్, హర్యానాయక్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో హుండీ చోరీ


హుండీ ధ్వంసం చేస్తున్న దొంగ(సీసీ ఫుటేజీ)

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్ అయ్యప్పస్వామి ఆలయ హుండీని బుధవారం తెల్లవారుజామున దొంగ పగులగొట్టాడు. అందులోని సొమ్ము అపహరించాడు. రాజీవ్ రహదారి పక్కనే ఉన్న ఆలయంలో జరిగిన హుండీ చోరీకి యత్నించిన దృశ్యాలు గల వీడియో, ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. నిందితుడి ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని ఎస్సై మల్లేశ్ కోరారు.

గ్యాస్ ఏజెన్సీపై కేసు


రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): రికార్డులు సరిగా నిర్వహించడం లేదంటూ గోదావరిఖనిలోని ఓ వంట గ్యాస్ ఏజెన్సీపై అధికారులు కేసు నమోదు చేశారు. పెద్దపల్లి డీసీఎస్‌వో ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది గోదావరిఖని శివాజీనగర్‌లోని రవితేజ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు సరిగా నిర్వహించడం లేదని గుర్తించారు. నిల్వల్లోనూ వ్యత్యాసం ఉందని తేల్చి కేసు నమోదు చేసినట్లు డీసీఎస్‌వో ప్రేమ్‌కుమార్ తెలిపారు.

వేడెక్కిన రైల్వేట్రాక్


రైల్వేట్రాక్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

రామగుండం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని రైల్వేట్రాక్‌లు ఎండల తీవ్రతత వేడెక్కుతున్నాయి. ఈక్రమంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో రైల్వేట్రాక్‌పై 58 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ఈనెల 4, 5వ తేదీల్లోనూ గరిష్ఠంగా 59, ఈనెల 3, 6వ తేదీల్లో 58 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ మార్పులతో 50–54 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వివరించారు. రైల్వేట్రాక్ వేడెక్కడంతో కార్మికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పనివేళల్లో మార్పులు చేసినా.. ఉదయం 8గంటల నుంచే రైల్వేట్రాక్‌పై 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని పేర్కొంటున్నారు. కాంట్రాక్టరు మానవతా దృక్పథంతో ఆలోచించి పనిస్థలాల్లో కనీసం టెంట్ సౌకర్యం కల్పించాలని, చల్లటి తాగునీరు అందుబాటులో ఉంచాలని, షూస్, టోపీలు, ఓఆర్‌ఎస్‌లు అందజేయాలని, మేలో ప్ర త్యేక ఇన్సెంటివ్ చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు.


రన్నరప్ ఉమ్మడి కరీంనగర్ టీ20 క్రికెట్ జట్టు

హెచ్‌సీఏ టీ20 రన్నరప్ కరీంనగర్

కరీంనగర్‌స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న టీ20 క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఉమ్మడి కరీంనగర్ టీ20 జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఉప్పల్ స్టేడియంలో బుధవారం మెదక్ జిల్లా జట్టుతో జరిగిన ఫైనల్‌లో జిల్లా జట్టు ఓటమి చెంది రన్నరప్‌గా నిలిచింది. ఉమ్మడి జిల్లా జట్టును జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆగంరావు, మురళీధర్ రావు, ఉపాధ్యక్షుడు మహేందర్‌గౌడ్, టీం మేనేజర్ మనోహర్ రావు అభినందించారు.

మాయా‘లేడీ’వలలో సింగరేణి అధికారి

- 8తులాల బంగారం, నగదు, సెల్‌ఫోన్లతో యువతి పరార్

గోదావరిఖని: ప్రియుడితో కలిసి ఓ యువతి సింగరేణి అధికారిని ట్రాప్ చేసి భారీమొత్తంతో పట్టుకుని ఉడాయించినట్లు గోదావరిఖనిలో ప్రచారం జరుగుతోంది. రామగుండం రీజియన్‌లోని సింగరేణి అధికారి ఒకరిని ఓ యువతి మాయమాటలతో తన ట్రాప్‌లోకి దింపినట్లు సమాచారం. తొలుత ఆ యువతి సదరు అధికారి ఇంటికి వెళ్లినట్లు, దీనిగురించి తన ప్రియుడికి ముందే సమాచారం అందించినట్లుగా తెలుస్తోంది. ఆమె వెళ్లిన కొద్దిసేపటికే ప్రియుడు ఆ అధికారి ఇంటికి వెళ్లి బ్లాక్‌మెయిల్ చేసి బెదిరించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో అధికారి నుంచి 8తులాల బంగారం, కొంత నగదు, నాలుగు సెల్‌ఫోన్లతో యువకుడు, యువతి పరారైనట్లు సమాచారం. ఈవిషయంలో సదరు అధికారి పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. త్వరలో ఈవిషయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

వృద్ధురాలి హత్య కేసులో జీవితఖైదు

గోదావరిఖనిటౌన్: రామగుండం ముబారక్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు సమ్మెట బాలమ్మ హత్య కేసులో అదేకాలనీకి చెందిన నగునూరి నరేశ్‌కు జీవిత ఖైదు విధిస్తూ గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. సమ్మెట తిరుపతిపై పాత కక్షలను దృష్టిలో పెట్టుకొన్న అదే కాలనీకి చెందిన నగునూరి నరేశ్.. 2019 మార్చి ఒకటో తేదీన సమ్మెట తిరుపతి తల్లి బాలమ్మను గొడ్డలితో నరికి చంపివేశాడు. తిరుపతి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై దత్తాత్రి కేసు నమోదు చేశారు. సీఐ, ప్రస్తుత ఆర్బీ ఇన్‌స్పెక్టర్ స్వామి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ అజయ్‌బాబు, ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో 14మంది సాక్ష్యులను కోర్టు డ్యూటీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, కోర్టు లైజన్ ఆఫీసర్ శంకర్ కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు జిల్లా న్యాయస్థాన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.జ్యోతిరెడ్డి తన వాదనలు వినిపించారు. అయితే, నగునూరి నరేశ్‌పై నేరం రుజువు కావడంతో జీవితఖైదుతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

హమ్మయ్యా.. చిక్కిన గంజాయి నిందితుడు

- ముంబైలో పట్టుకున్న పోలీసులు


రత్న విలాస్

చందుర్తి(వేములవాడ): నెల రోజుల క్రితం చందుర్తి పోలీస్‌స్టేషన్ నుంచి తప్పించుకొని పరారైన గంజాయి నిందితుడు ముంబైలో దొరికాడు. చందుర్తి ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు. గత నెల 29న చందుర్తి మండలం మర్రిగడ్డ శివారులో గంగాధర్ మండలం గర్షకుర్తికి చెందిన రత్న విలాస్ గంజాయితో పట్టుబడ్డాడు. అదే రాత్రి చందుర్తి పోలీస్‌స్టేషన్ నుంచి పరారయ్యాడు. ఈ విషయాన్ని పోలీసులు ఉన్నతాధికారుల తీవ్రంగా పరగణించి నిందితుడు రత్న విలాస్ కోసం తీవ్రంగా గాలించారు. అతని సన్నిహితుల కాల్‌డేటా ఆధారంగా మహారాష్ట్ర వైపు పరారైనట్లు గుర్తించారు. జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందాన్ని మహారాష్ట్రకు పంపించారు. నిందితుని కోసం గాలిస్తుండగా ముంబైలోని చండీవాలీ ప్రాంతంలో అరెస్టు చేసి చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొస్తున్నారు.

చార్‌ధామ్ యాత్రకు వెళ్లి.. అనంత లోకాలకు

- గుండెపోటుతో వ్యాపారి మృతి


కృష్ణమూర్తి (ఫైల్)

హుజూరాబాద్: చార్‌ధామ్ యాత్రకు వెళ్లిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పెద్ద పాపయ్యపల్లి గ్రామానికి నార్ల కృష్ణమూర్తి (70) పట్టణంలో 40 ఏళ్లుగా ఆయిల్ మిల్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో బద్రీనాథ్ కేదార్‌నాథ్ అమర్నాథ్ తదితర పుణ్యక్షేత్రాలు సందర్శించుకునేందుకు ఈనెల 25న కృష్ణమూర్తి ఇతర యాత్రికులతో కలిసి వెళ్లారు. అక్కడ తీవ్ర అస్వస్థతకు గురై గుండె పోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. గురువారం పార్థివదేహాన్ని స్వగృహానికి తీసుకురానున్నారు.

వాహనం ఢీకొని గేదెలు మృత్యువాత


కళేబారాలు తరలిస్తున్న సిబ్బంది

సుల్తానాబాద్(పెద్దపల్లి): పట్టణ పరిధిలోని పూసాల సమీప రాజీవ్ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృత్యువాత పడ్డాయని మున్సిపల్ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్ బుధవారం తెలిపారు. రైతు ఇంట్లో నుంచి బయటకు రాగానే అటుగా వెళ్తున్న వాహనం ఢీకొందని పేర్కొన్నారు. గేదెల కళేబరాలతో దుర్వాసన వస్తోందని స్థానికులు మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. దీంతో క్రేన్‌సాయంతో కార్మికులు కళేబరాలను లారీలో శ్మశానవాటికకు తరలించి పూడ్చివేశారు.

‘న్యాయ సంహితా’పై కసరత్తు

- పోలీసులకు నాలుగు రోజుల శిక్షణ
- ఐపీసీ సెక్షన్ల నంబర్లలో మార్పులు
- జూలై ఒకటి నుంచి అమలు


శిక్షణ పొందుతున్న పోలీసులు(ఫైల్)

కోరుట్ల: మరో నెలరోజుల వ్యవధిలో ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) స్థానంలో అమల్లోకి రానున్న భారతీయ న్యాయ సంహితపై పోలీసులు కసరత్తు ప్రారంభించారు. నాలుగు రోజులుగా జిల్లాకేంద్రంలో జిల్లాలోని వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులకు శిక్షణ మొదలెట్టారు. ఐపీసీ సెక్షన్ల నంబర్లతోపాటు శిక్ష, జరిమానాల్లో బీఎన్ఎస్ ప్రకారం కొంత మార్పులు చోటు చేసుకున్నాయి. పోలీసు శాఖ తరచూ నమోదు చేసే కేసులకు సంబంధించిన సెక్షన్ నంబర్లలో వచ్చిన మార్పులతోపాటు ప్రతీ కేసుకూ నూతనంగా అందివచ్చిన సాంకేతిక పరిజ్ఞానం ఎలా ఉపయోగించుకోవాలన్న విషయంలోనూ అవగాహన కల్పిస్తున్నారు.

సెక్షన్ నంబర్లు.. శిక్షల్లోనూ మార్పులు

కొత్తగా రూపొందించిన భారతీయ న్యాయ సంహిత నేపథ్యంలో ఐపీసీ ప్రకారం గతంలో 511 సెక్షన్లు ఉండగా.. ప్రస్తుతం బీఎన్ఎస్ ప్రకారం వాటిని 358కి కుదించినట్లు సమాచారం. బ్రిటిష్ కాలంలో రూపొందించిన ఐపీసీలో ఉన్న కొన్ని సెక్షన్లు ప్రస్తుత సమకాలీన పరిస్థితులకు అవసరం లేదని భావించిన క్రమంలో ఈ మార్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు ఐపీసీ 302 సెక్షన్ బీఎన్ఎస్ ప్రకారం 103 నంబర్‌గా మార్పు చేశారు. సాధారణంగా ఎవరైనా కొట్టుకున్న కేసు ఉండే ఐపీసీ కింద 324 సెక్షన్ కింద కేసు నమోదు చేసేవారు. ఇప్పుడు బీఎన్ఎస్ ప్రకారం కొట్టుకుంటే 118 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేయనున్నారు. ఈ కేసులో రూ.5వేలు జరిమానా ఉండగా తాజాగా రూ.20వేలు దాకా వేయొచ్చు. బహిరంగంగా మద్యం తాగిన కేసులో జరిమానా ఇదివరకు రూ.200 వరకు ఉండగా.. ఇప్పుడు రూ.500కు పెంచారు. అదే రీతిలో రోడు ప్రమాదంలో హిట్ రన్ కింద నమోదైన కేసుల్లో నిందితులకు గతంలో మూడేళ్ల జైలు శిక్షకు అవకాశం ఉండగా బీఎన్ఎస్ ప్రకారం ఐదేళ్ల వరకు శిక్ష వేయవచ్చు.

ప్రతి కేసుకూ సాంకేతిక సాక్ష్యాలు

ప్రతి కేసులో ఇదివరకు కేవలం రాతపరమైన ధ్రువ పత్రాలు, నిందితులు నేర అంగీకారం తెలిపే కాగితాలు, వాటిపై వారి సంతకాలు సేకరించి కోర్టుకు సమర్పించడం ఆనవాయితీగా ఉండేది. ప్రస్తుత కాలంలో పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని పంచనామాలకు సైతం వీడియో సాక్ష్యాలు, నిందితుల నేర అంగీకరణకు వీడియో రికార్డులు చేయాల్సిన అవసరాన్ని పోలీసు శిక్షణలో తెలియజేస్తున్నారు. పెరుగుతున్న సైబర్ నేరాల పరిష్కారాల్లో ఎలక్ట్రానిక్ సాంకేతిక పరికరాల ఆధారంగా పరిశోధన సాగించి కేసులను త్వరితగతిన పక్కా సాక్ష్యాలతో నిరూపించేలా పోలీసులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ అంశాలపై ప్రతి జిల్లా నుంచి వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న సుమారు పది మంది పోలీసు అధికారులకు ఇదివరకే హైదరాబాద్ పోలీసు అకాడమీలో శిక్షణ ఇచ్చారు. అక్కడ శిక్షణ పొందిన అధికారులు ప్రస్తుతం భారతీయ న్యాయ సంహితలో జరిగిన మార్పులపై జిల్లా పోలీసులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు. జూలై ఒకటో తేది నుంచి నేరాల నమోదు పరిష్కార విధానాలు భారతీయ న్యాయ సంహిత ప్రకారం కొనసాగనున్నట్లు శిక్షణ పొందుతున్న పోలీసులకు ఉన్నతాధికారులు చెబుతున్నారు.